సాక్షి పెద్దపల్లి

సోమవారం ౹ 8 ౹ జనవరి ౹ 2024



స్వామివారికి మొక్కులు

కమాన్‌పూర్ : స్థానిక శ్రీఆదివరాహస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దర్శనం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.



ఆత్మీయ సన్మానం

రామగుండం: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్‌ను అంతర్గాంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రతినిధులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
29.8/16.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యాప్రగతికి బాటలు వేద్దాం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడం ద్వారా విద్యాప్రగతికి బాటలు వేద్దామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుంకిశీల ప్రభాకర్‌రావు, ప్రధానకార్యదర్శి గుర్రం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్‌తో కలిసి ఆదివారం శివపల్లిలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, అక్షరాస్యతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడానికి అందరం శ్రమించాలన్నారు. ప్రతినిధులు రెహ్మాన్, రవి, కుమార్, మహేందర్, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవి మల్లయ్యకు సత్కారం



ప్రశంసపత్రం అందుకుంటున్న మల్లయ్య

కమాన్‌పూర్(మంథని): ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆంధ్ర సారస్వత పరిషత్ చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభల కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా రొంపికుంటకు చెందిన కవి కూచన మల్లయ్య అవార్డుతోపాటు ప్రశంసపత్రం అందుకున్నారు. మహాసభల్లో 'నిజం లేని నిజాలు' గేయ కవితాగానం చేసిన మల్లయ్యకు ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన



వివరాలు పరిశీలిస్తున్న డీపీవో చంద్రమౌళి

కమాన్‌పూర్(మంథని): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను డీపీవో చంద్రమౌళి ఆదివారం పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజులుగా ప్రజాపాలన దరఖాస్తులను ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో ఆపరేటర్లు నమోదు చేస్తున్నారు. డీపీవో ఆ ప్రక్రియను పరిశీలించి ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలని ఆయన సూచించారు. డీపీవో వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్యసూరి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం



తిలకిస్తున్న గ్రామస్తులు

మంథని: నాగారం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆదివారం ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాలారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వందశాతం మరుగుదొడ్లు పూర్తయ్యాయన్నారు. కిసాన్ నిధి ద్వారా రైతులకు సంవత్సరానికి రూ.6వేలు నరేంద్రమోదీ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఉజ్వల గ్యాస్ ద్వారా సబ్సిడీ అందిస్తున్నారని, పదేళ్ల వయసుగల పిల్లలకు నెలకు రూ.వెయ్యి డిపాజిట్ చేయడం ద్వారా 21 సంవత్సరాలకు వరకు రూ.ఐదు లక్షలు తపాలా కార్యాలయం ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. ఉపాధిహామీ పథకం, జీవనజ్యోతితోపాటు పలు పథకాల ద్వారా పేదలకు అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వివరించారు. బీపీఎం మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవళిక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో భక్తుల కోలాహలం



ఓదెల(పెద్దపల్లి): ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వివిధ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, పట్నాలు వేసి, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, ఈవో సదయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఒత్తిళ్లా.. పైరవీలా..?

సమాజానికి దిక్సూచి విద్యా వ్యవస్థ. ఆ రంగంపై రాజకీయ జోక్యం మితిమీరుతోందా? అందుకే రెగ్యులర్ ఎంఈవోల స్థానంలో ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నారా? వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా.. అధికార యంత్రాంగం ఇంకా ఎందుకు స్పందించడం లేదు? ఇలాంటి ప్రశ్నలన్నీ తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల మదిని తొలుస్తున్నాయి.

– పెద్దపల్లిరూరల్



పెద్దపల్లి ఎంఈవో కార్యాలయం

- విద్యారంగంలో మితిమీరుతున్న రాజకీయ జోక్యం!
- ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోల బాధ్యతలు
- జిల్లాలో 14 మండలాలు.. ఒక్కరూ రెగ్యులర్ ఎంఈవో లేరు
- కమాన్‌పూర్ హెచ్‌ఎంకు ఐదు మండలాల బాధ్యతలు
- సమీపిస్తున్న వార్షిక పరీక్షలు.. గాడితప్పుతున్న విద్యాబోధన

జిల్లాలో విద్యా వ్యవస్థ ఇంకా మెరుగుపడాల్సి ఉంది. ప్రధానంగా మండలాల్లోని పాఠశాలల పర్యవేక్షణకు రెగ్యులర్ ఎంఈవోలను నియమించాల్సి ఉంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా ఇంకా ప్రధానోపాధ్యాయులకే ఇన్‌చార్జి ఎంఈవో బాధ్యతలు అప్పగించి నెట్టుకు రావడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు.. ప్రతీ మండలంలో సీనియర్ హెచ్‌ఎంలు ఉన్నా.. కమాన్‌పూర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సంపత్‌రావుకు ఐదు మండలాల ఎంఈవో బాధ్యతలు అప్పగించడం విద్యారంగం గాడితప్పుతున్నదనడానికి నిదర్శనమని ఉపాధ్యాయ ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు.

హెచ్‌ఎంల బహుపాత్రాభినయం

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తమ సబ్జెక్టును బోధించడంతో పాటు స్కూళ్ల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాల్సిన ప్రధానోపాధ్యాయులను అసలు పనుల నుంచి తప్పించి క్లస్టర్ ఇన్‌చార్జిలుగా, మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- హెచ్‌ఎం విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. ఇతర విధుల్లో ఏళ్ల తరబడి నిమగ్నం కావడంతో బోధన విషయమే మర్చిపోతున్నారని నిపుణులు అంటున్నారు.

కమాన్‌పూర్ హెచ్‌ఎంకు ఐదు మండలాలు..

- జిల్లాలో 14 మండలాలు ఉండగా.. అన్నింటికీ ఇన్‌చార్జి ఎంఈవోలనే నియమించారు.
- అదికూడా కేవలం ఆరుగురు హెచ్‌ఎంలకే 14 మండలాల బాధ్యతలు అప్పగించారు.
- అందునా కమాన్‌పూర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సంపత్‌రావుకు ఆ మండల క్లస్టర్ ఇన్‌చార్జితోపాటు కమాన్‌పూర్, రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, రామగిరి ఎంఈవో విధులూ అప్పగించడం గమనార్హం.
- అలాగే పెద్దపల్లిలో బాలుర జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సురేందర్‌కు పెద్దపల్లి, సుల్తానాబాద్, సుల్తానాబాద్ మండలం కనుకుల హెచ్‌ఎం రాజయ్యకు శ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు హైస్కూల్ హెచ్‌ఎం కవితకు జూలపల్లి, ఎలిగేడు, లక్ష్మికి మంథని, ముత్తారం, ధర్మారం హెచ్‌ఎం ఛాయాదేవికి ధర్మారం ఎంఈవో బాధ్యతలు అప్పగించారు.

సీఆర్పీలతోనే పర్యవేక్షణ..

ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియమితులైన సీఆర్పీలతోనే పాఠశాలల పర్యవేక్షణ చేయిస్తున్నారు. ఇన్‌చార్జి ఎంఈవో ప్రభుత్వ రికార్డులు రాయడం, సంతకాలు చేయడానికే పరిమితమయ్యారనే ఆరోపణలున్నాయి. కొందరు సీఆర్పీలు తామే విద్యాధికారులమనే రీతిన వ్యవహరిస్తున్నారని, అందుకు ఇన్‌చార్జి ఎంఈవోల అండదండలే కారణమని కొందరు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

అనేక అనుమానాలు.

ఎంఈవో బాధ్యతలను హెచ్‌ఎంలకు అప్పగించడంలో రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? లేక పైరవీలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీమండలంలోని సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవో బాధ్యతలు అప్పగించకుండా ఒక్క హెచ్‌ఎంకే ఐదు మండలాలను ఎందుకు ఇచ్చారనేది అంతుచిక్కడం లేదంటున్నారు. అలాగే ప్రతీ ప్రధానోపాధ్యాయుడికి క్లస్టర్‌తోపాటు రెండు మండలాల బాధ్యతలు అప్పగించిన విషయాలు ప్రస్తావిస్తున్నారు. ఏ మండలంలోని సీనియర్ హెచ్‌ఎంకు ఆ మండల బాధ్యత అప్పగిస్తే స్కూల్ నిర్వహణ కొంత సులువుగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంతటా ఇదే పరిస్థితి

ఎంఈవో పోస్టులన్నీ అంతటా ఖాళీగానే ఉన్నాయి. ఇప్పటికే ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన వారిని మార్చే అవకాశంలేదు. మన జిల్లాలోనే పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. ఇంకా కొన్ని జిల్లాల్లో డీఈవోలే ఇన్‌చార్జి ఎంఈవోలుగా వ్యవహరిస్తున్నారు. – మాధవి, డీఈవో

బోధన సాగడం లేదు



ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో విద్యాబోధన ముందుకు సాగడంలేదు. హెచ్‌ఎంలుగా వేతనం పొందుతూ ఇతర విధుల్లో నిమగ్నం కావడంతో సర్కారు అసలు లక్ష్యం నెరవేరడంలేదు. ఉన్నతాధికారులు రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి.

– ప్రవీణ్, పేరెంట్స్‌కమిటీ చైర్మన్

ఫలితాలెలా వస్తాయి?



పాఠశాలల నిర్వహణ బాధ్యతలను చూడాల్సిన ప్రధానోపాధ్యాయులపై అదనపు భారం మోపితే మంచి ఫలితాలు ఎలా సాధిస్తారో ఉన్నతాధికారులకే తెలియాలి. అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలనే నియమించాలి. లేదంటే ఆ మండల పరిధిలోని సీనియర్లకే అదనపు బాధ్యతలు అప్పగించడం మంచిది.

– సతీశ్, పేరెంట్

ప్రభుత్వ నిర్లక్ష్యమే..



విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు చెబుతున్న పాలకులు.. ఎంఈవోలను నియమించక పోవడం దారుణం. ఒక్క రెగ్యులర్ ఎంఈవో కూడా లేకపోవడాన్ని బట్టి చూస్తే ప్రభుత్వానికి విద్యారంగంపై ఏపాటి శ్రద్ధ ఉందో తెలుస్తోంది. ఇప్పటికైనా సర్కారు ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలి.

– ఆర్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌ఎఫ్‌ఐ

వారధి.. జాడేది?



గోదావరి నదిపై వంతెన నిర్మించే ప్రదేశం ఇదే..

- మూడు నెలలుగా ముందుకు సాగని పనులు!
- కొలువుదీరిన కొత్త ప్రభుత్వంపై జిల్లావాసుల ఆశలు

రామగుండం: అంతర్గాం మండలంలోని గోదావరి నదిపై చేపట్టిన హైలెవల్ రోడ్డు వంతెన పనులు మూడు నెలలుగా ముందుకు సాగడంలేదు. దీంతో పెద్దపల్లి–మంచిర్యాల జిల్లావాసుల్లో అసంతృప్తి నెలకొంది. నిర్మాణానికి ముందు ఇరువైపులా రోడ్డు సర్వే, గోదావరి నది మట్టి పరీక్షల ప్రక్రియను ఆర్భాటంగా చేపట్టారు. 2023 జూన్ 9వ తేదీన మంచిర్యాలలో అప్పటి సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో గోదావరి నది వంతెన పనులు ప్రారంభించారు. ఆ తర్వాత అన్ని పరీక్షలు పూర్తిచేసిన ఆర్ అండ్ బీ అధికారులు.. మంచిర్యాల వైపు వంతెన పనులు ప్రారంభించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల హడావిడి అధికం కావడంతో నిధుల మంజూరులో జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా పనుల్లోనూ ఆలస్యమైంది. ఆ తర్వాత కొద్దిరోజులకే కాంట్రాక్టరు పనులు నిలిపివేసినట్లు సమాచారం. మరోవైపు.. రెండు నెలల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టు కుంగడంతో బ్యారేజీలోని నీటిని ఖాళీ చేయించారు. దీంతో రామగుండం వద్ద వంతెన పనుల్లో కదలిక వస్తుందని భావించినా.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరడంతో వంతెనపై ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడడంలేదు.

ఆరేళ్ల క్రితమే హైలెవల్ వంతెనకు శ్రీకారం..

- ఆరేళ్ల క్రితం ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా గోదావరి నదిపై రోడ్డు వంతెన నిర్మిస్తామని, అందుకు రూ.125 కోట్లు కేటాయిస్తున్నామని 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు.
- అంతర్గాం మండలానికి చెందిన మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని మంచిర్యాల, అంతర్గాం వైపు వంతెన సాధన సమితి పేరిట ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు.
- రోడ్డు వంతెన కోసం గాంధేయ మార్గంలో ఆందోళనకు శ్రీకారం చుట్టారు.
- ప్రభుత్వంపై ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది.

జూన్‌లోనే టెండరు ప్రక్రియ పూర్తి..

- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గోదావరి నదిపై వంతెన నిర్మిస్తే రెండు జిల్లాల ప్రజలకు దోహదపడుతుందని, ఎన్నికల ఏడాది కావడంతో పార్టీకి కలిసి వస్తుందని భావించింది.
- దీంతో వంతెన నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది.
- అయితే, గోదావరిలో కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నిండి ఉండడంతో తొలుత వంతెన నిర్మాణానికి కేటాయించిన రూ.125 కోట్లు సరిపోవని అంచనా వేసింది.
- సమాలోచనల తర్వాత టెండర్లు ఆహ్వానించగా రూ.164 కోట్లకు వల్లభనేని కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు దక్కించుకుంది.
- ఆ తర్వాత కన్‌స్ట్రక్షన్ సంస్థ, ఆర్ అండ్ బీ సంయుక్తంగా నిర్మాణ స్థితిగతులపై ప్రాథమిక సర్వే చేశాయి.
- ఇరువైపులా మట్టి పరీక్షలు, భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశాయి.
- చివరగా నవంబర్, డిసెంబర్‌లో పనులను యుద్ధప్రాతిపదికన ప్రారంభిస్తామని ప్రకటించాయి.
- కానీ, ఇప్పటి వరకు వంతెన నిర్మాణంపై ఊసేలేదు.
- జిల్లావాసులు ఆత్రుతతో ఉన్నారు.



సర్వే చేస్తున్న ఇంజినీర్లు(ఫైల్)

ఇరువైపులా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే..

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల, రామగుండం ఎమ్మెల్యేలుగా కాంగ్రెస్ నేతలు ఎన్నికయ్యారు. మంచిర్యాల నుంచి ప్రేంసాగర్‌రావు, రామగుండం నుంచి మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. అయితే, వంతెన నిర్మాణంపై వీరిద్దరూ తీసుకునే నిర్ణయమే కీలకంగా మారుతుందనే చర్చ సాగుతోంది. రహదారుల అభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని భావిస్తున్న నేతలు.. గోదావరిపై వంతెన నిర్మాణంతో దూరభారం బాగా తగ్గడంతోపాటు ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



కష్టాలు తీరినట్లే..



కొత్తపల్లి – కొలనూరు మధ్య రైల్వేట్రాక్‌తో పల్లెవాసులు ఇకనుంచి గంటలకొద్దీ నిరీక్షించాల్సిన అవసరంలేదు. ఈ మార్గంలో నిత్యం రైళ్ల రద్దీ అధికంగా ఉంటుంది. అందుకే రైల్వేగేట్ తరచూ గంటల కొద్దీ మూసివేయడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే, ఇదేప్రాంతంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చివరిదశకు చేరడంతో ఈ మార్గంలోని పల్లెవాసుల కష్టాలు తీరినట్లేనని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సీపీఐని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత తాండ్ర సదానందం

గోదావరిఖని: కార్యకర్తలు, ప్రజాసంఘాలు సమష్టిగా కృషి చేసి పార్టీని బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. ఆదివారం నగరంలోని భాస్కర్‌భవన్‌లో నగర కౌన్సిల్ సమావేశం మార్కపురి సత్యం అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సదానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2024 సంవత్సరపు నూతన సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతీ డివిజన్ నుంచి సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. మండల స్థాయిలోనూ సభ్యత్వాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. కార్పొరేషన్‌లో ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తేనే పార్టీకి గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రజాపాలన్లజీ ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందని, గడువు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ పోటీలో ఉంటుందని తెలిపారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

ఎలిగేడు నుంచి నేపాల్ వరకు..

- అంతర్జాతీయ స్థాయిలో యువకుడి ప్రతిభ
- క్రికెట్‌లో రాణిస్తున్న ఎలిగేడువాసి

ఎలిగేడు(పెద్దపల్లి): పాఠశాల స్థాయి నుంచే క్రికెట్‌పై ఎంతో ఇష్టం. అంతేకాదు.. ఆటలో నైపుణ్యం ప్రదర్శించాలనే పట్టుదల.. లక్ష్యం నిర్దేశించుకున్నాడు.. శ్రమించాడు.. అంతే.. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ చూపుతున్నాడు ఎలిగేడుకు చెందిన క్రికెటర్ కాంపెల్లి సాయిప్రశాంత్. కాంపెల్లి రవి– సరోజన దంపతుల కుమారుడు సాయిప్రశాంత్.. పెద్దపల్లిలో ఐటీఐ సెకండియర్ చదువుతున్నాడు. గత నవంబర్‌లో రూరల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సిల్వర్ మెడల్ అందుకుని ఔరా అనిపించాడు. అదే నెల గోవాలో జరిగిన 14వ నేషనల్ రూరల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కెప్టెన్‌గా వ్యవహరించి గోల్డ్‌మెడల్, కప్ సాధించాడు. అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. డిసెంబర్‌లో నేపాల్‌లో జరిగిన ఇండో – నేపాల్ ఇంటర్నేషనల్ రూరల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సాయిప్రశాంత్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. గోల్డ్‌మెడల్ సాధించి నేపాల్‌లో నిర్వాహకుల చేతులమీదుగా తనజట్టుతో కలిసి కప్ అందుకున్నాడు. ప్రభుత్వం ప్రోత్సహించి కోచ్ ద్వారా శిక్షణ ఇప్పిస్తే ఇండియా క్రికెట్ టీంలో ఆడి భారతదేశానికి గొప్ప గుర్తింపు తీసుకు రావడమే తన లక్ష్యమని సాయిప్రశాంత్ తెలిపాడు. సాయిప్రశాంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, క్రికెట్ అభిమానులు తదితరులు అభినందించారు.



నేపాల్‌లో గోల్డ్‌మెలిస్ట్ సాయిప్రశాంత్ టీం

బీఆర్‌ఎస్.. బీజేపీ.. ఓ నారుమడి



అడవిపందులు, పక్షుల నుంచి తన వరి నారును కాపాడుకునేందుకు ఓ రైతు రెండు పార్టీల జెండాలను మడి చుట్టూ ఏర్పాటు చేశాడు. దారి వెంట వెళ్లేవారు ఆ జెండాలు చూస్తూ మురిసిపోతున్నారు.. ఇందులో ఒకటి బీఆర్‌ఎస్‌ది కాగా మరొటి బీజేపీ జెండా. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇలాగే కలిసి పోటీ చేస్తాయా? అని చర్చించుకోవడం కనిపించింది. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ శివారులో కనిపించిదీ దృశ్యం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఆకాశానికి పందిరి

పెద్దపల్లి – కూనారం మార్గంలోని మానేరుగొండ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా చెట్లు ఏపుగా పెరిగాయి. పచ్చదనంతోపాటు ఆహ్లాదం పంచుతున్నాయి. ఆకాశానికి పచ్చని పందిరి వేసినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం ప్రయాణికులు, పల్లెవాసులను మంత్రముగ్ధులను చేస్తోంది.



క్లుప్తంగా

గుండెపోటుతో గంగపుత్ర సంఘం అధ్యక్షుడి మృతి


శివకుమార్ (ఫైల్)

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ బెస్త గంగ పుత్ర సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దేశ శివ కుమార్ గుండెపోటుతో మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన శివకుమార్‌కు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు వచ్చింది. కుటుంసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. ఆయన మృతదేహానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ సునీల్‌రావు, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, సంఘం పట్టణ అధ్యక్షుడు కూర ధర్మరాజు పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, చెర్ల భూత్కూర్ గ్రామాల్లోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి, లోపలి సామగ్రి చోరీ చేశారు. ట్రాన్స్‌కో ఏఈ నరేశ్ వివరాల ప్రకారం.. ఇరుకుల్ల శివారులో వ్యవసాయ బావులకు సంబంధించిన 16 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ఉండటాన్ని ఆదివారం ఉదయం గమనించిన మొగ్దుంపూర్ రైతు వేల్పుల లచ్చయ్య అధికారులకు సమాచారం అందించాడు. ఏఈ నరేశ్, లైన్‌మెన్ మోబిన్‌పాషా, జేఎల్ఎం కిరణ్ సంఘటన స్థలానికి వెళ్లారు. స్థానిక రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఆ సమయంలో చెర్లభూత్కూర్‌లో సైతం ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టారని అక్కడి రైతు జడ వీరమల్లు సమాచారంతో వెళ్లి, పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు, ఆయిల్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారని ఏఈ పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

భూతగాదాలో అన్నపై తమ్ముడి దాడి


గాయపడ్డ నారాయణ

చందుర్తి(వేములవాడ): భూతగాదాతో గొడవపడ్డ అన్నపై తమ్ముడు దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం కట్టలింగంపేటలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. కట్టలింగంపేటకు చెందిన కోరుట్ల నారాయణ, కోరుట్ల చంద్రయ్యలు అన్నదమ్ములు. కొద్ది నెలలుగా ఇద్దరి మధ్య భూతగాదాలు నడుస్తున్నాయి. ఆదివారం పొలం గట్టును ట్రాక్టర్ కేజ్ వీల్స్‌తో తొక్కించాడని అన్నదమ్ములు గొడవకు దిగారు. అన్న దాడి చేసేందుకు యత్నించగా తమ్ముడు కర్రతో కొట్టాడు. ఈ దాడితో గాయపడ్డ అన్న నారాయణ ఫిర్యాదుతో తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రంగస్వామి తెలిపారు.

‘సాక్షి’ స్పెల్‌బీకి అనూహ్య స్పందన

రీజినల్ స్థాయి పరీక్షకు 150 మందికిపైగా హాజరు

ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం

కాజీపేట : విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కాజీపేట శివారు తాళ్లపద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టిన ఈ పరీక్షకు తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల నుంచి 150 మందికిపైగా విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ‘సాక్షి’ వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ మొదటిసారిగా రీజినల్ స్థాయి పోటీ పరీక్ష వరంగల్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్ పరంగా నాలెడ్జ్ పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసే ప్రయత్నంలో ‘సాక్షి’ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా గ్రాట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజమండ్రి వ్యవహరిస్తున్నారని చెప్పారు. కాగా, తమ స్కూళ్లలో కూడా ఇలాంటి పోటీ పరీక్షలు నిర్వహించాలనుకుంటే ఆయా పాఠశాలల యాజమాన్యాలు 9505514424 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ‘సాక్షి’ వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, టీవీ కరస్పాండెంట్ తుమ్మ శ్రీధర్‌రెడ్డి, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్‌గుప్తా, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, తాళ్లపద్మావతి ప్రిన్సిపాల్ అఫ్జల్ ఉన్నీసా, సృజన్, రాకేష్, యామిని, మహేందర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థుల మనోగతం ఇలా ఉంది..


సోమిడిలోని తాళ్ల పద్మావతి కళాశాలలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పిల్లలు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నారు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ ఇంగ్లిష్ పోటీ పరీక్షలు పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. భాషపై నెలకొన్న భయాన్ని దూరం చేసేందుకు ఈ పరీక్షలు ఉన్నాయి. ఈ పోటీలకు మా కళాశాల వేదికగా మారడం సంతోషంగా ఉంది.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యా సంస్థల చైర్మన్

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరిగింది..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనే ఉద్దేశంతో కొత్త పదాలు నేర్చుకోవడం మొదలు పెట్టిన తరువాత ఇంగ్లిష్ భాషపై ఇంకా ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు కనిపించినప్పుడు వాటి స్పెల్లింగ్ పునశ్చరణ చేసుకుంటున్నా.

- పి.అథితి, రావూస్ టెక్నో స్కూల్, కరీంనగర్

ప్రయోజనకరంగా ఉంది



మాతృభాషతో పాటు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే లక్ష్యాలను చేరుకుంటాం. తరగతి పుస్తకాలతో పాటు దిన పత్రికలు చదువుతూ ఇంగ్లిష్ నేర్చుకుంటున్నా. నా ప్రయత్నానికి స్పెల్‌బీ పరీక్ష ఎంతో ప్రయోజనకరంగా ఉంది.

- మదియా, శ్రీఅరవిందో హైస్కూల్, జనగామ

ఉపాధ్యాయుల సహకారం బాగుంది..



స్పెల్‌బీ పరీక్ష రాయడం వల్ల ఉత్సాహం రెంట్టింపు అయింది. ఇంగ్లిష్‌పై నాలో ఉన్న పట్టుదలను గుర్తించిన ఉపాధ్యాయులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనేలా ప్రోత్సహించారు. ఫైనల్స్‌కు వెళ్తాననే నమ్మకం మరింత పెరిగింది.

- వంశిక, ఎంజేపీ, బాలికల ఉన్నత పాఠశాల, కమలాపూర్

భాష సులువు అనిపిస్తోంది..



స్పెల్‌బీ ఇంగ్లిష్ పరీక్ష రాయడం వల్ల భాష సులువు అనిపిస్తోంది. ఉచ్చారణ బాగా వస్తోంది. పదాలు గుర్తు పెట్టుకోవడం, కొత్త పదాలు వెతకడం వల్ల ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు. ‘సాక్షి’కి కృతజ్ఞతలు.

- నిహారిక శర్మ, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్, మిర్యాలగూడ

పోటీ పరీక్షలతో ఎంతో మేలు



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు నాలో నూతనోత్సాహం నింపాయి. ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి చక్కటి మార్గం. పాఠశాల స్థాయి **నుంచే పోటీ పరీక్ష**లకు హాజరైతే ప్రతిభ పెరుగుతుంది.

- కె.కార్తికేయ, జయ ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్, సూర్యాపేట

మరికొన్ని పదాలు నేర్చుకున్నా..



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం వల్ల ఇంగ్లిష్‌లో మరికొన్ని కొత్త పదాలు నేర్చుకోవడంతోపాటు ఆ పదాలు పలికే విధానం తెలుసుకున్నా. ఇప్పుడు **ఎలాంటి భయం** లేకుండా ఇంగ్లిష్ మాట్లాడొచ్చనే నమ్మకం పెరిగింది.

- ఎం.సాయిప్రియ, సాధన స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కరీంనగర్

ప్రతిభను సానబెట్టేందుకు..



విద్యార్థుల్లోని ప్రతిభను సానబెట్టేందుకు, పోటీతత్వం పెంచేందుకు స్పెల్‌బీ, ఇంగ్లిష్ పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. విద్యార్థులకు స్పెల్లింగ్‌లో **పట్టు పెరుగుతుంది.** ఇలాంటి పరీక్షలు ఎంతో దోహదపడతాయి.

- బి.సాన్వి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

ఏర్పాట్లు బాగున్నాయి



పిల్లలు ఇంగ్లిష్ భాషపై చక్కటి ప్రతిభ కనబర్చడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడానికి స్పెల్‌బీ ఎంతో ఉపయోగపడుతుంది. పరీక్ష ఏర్పాట్లు **బాగున్నాయి. మరిన్ని** పోటీ పరీక్షలు నిర్వహించాలి.

- సురేష్‌కుమార్, ఖమ్మం

మరింత పట్టు పెరిగింది..



‘సాక్షి’ ఏర్పాటు చేసిన పోటీ పరీక్షలకు హాజరుకావడం వల్ల గ్రామర్ సులభంగా నేర్చుకున్నా. ఇంగ్లిష్ భాషపై పట్టు పెరగడంతోపాటు ఎలా మాట్లాడాలనే **విషయం అర్థమైంది.** ఉత్సాహంగా పరీక్ష రాశా.

- రిషిత, రామన్ స్కూల్, సోమిడి

ఉపాధ్యాయుల సహకారంతో..



ఉపాధ్యాయుల సహకారంతో ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టు సాధించా. ఆ తరువాత మాట్లాడడం నేర్చుకున్నా. స్పెల్‌బీ పోటీలకు హాజరవుతూ భాషపై మరింత పట్టు సాధించా.

- ఎస్.జస్వంత్, త్రివేణి స్కూల్, ఖమ్మం

శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా..



‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ స్పెల్‌బీ పోటీలకు హాజరుకావాలనే తలంపుతో శ్రమకు ఓర్చి పిల్లలను తీసుకొచ్చా. ఇలాంటి పరీక్షలు రాయడం వల్ల పిల్లల్లో పోటీతత్వం అలవడుతుందనే భావనతో వచ్చాం.

- అర్చన, జనగామ

ఇంగ్లిష్‌పై భయం పోయింది



ఇంగ్లిష్‌పై నెలకొన్న భయం పోగొట్టడంలో ‘సాక్షి’ స్పెల్‌బీ పరీక్ష ఉపయోగపడింది. ఇంగ్లిష్ అంటే కష్టంకాదని, ఎంతో సులభంగా నేర్చుకోవచ్చనే భావన కలిగింది. సహ విద్యార్థులతో పోటీపడి పరీక్షకు సన్నద్ధమయ్యా.

- బి.సాయిపల్లవి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

రాజన్నకు జనహారతి


రాజన్నను దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో అభిషేకాలు, గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన కోడెమొక్కులు, నెలువెత్తు బెల్లం పంపిణీ, అమ్మవారికి కుంకుమపూజ, ఇతర మొక్కులు చెల్లించుకున్నారు. ఏఈవోలు శ్రీనివాస్, ప్రతాప నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, శ్రీరాములు, గోలి శ్రీనివాస్ ఏర్పాట్లను పరిశీలించారు.

శ్వాసకోశ సమస్యలపై జాగ్రత్తగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ వినయ్

కరీంనగర్ టౌన్: దైనందిన జీవితంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే శ్వాసకోశ సమస్యలకు పరిష్కారం ఉంటుందని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ వినయ్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో స్థానిక మెడికవర్ ఆస్పత్రి, ఐఎంఏ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ టాక్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చలికాలంలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అస్తమా పేషెంట్లు చలి, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సంచరించాల్సి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రపంచాన్ని వణికించిన కరోనాకు వ్యాక్సినేషన్ వచ్చిన కారణంగా ప్రాణాపాయ ముప్పు తప్పి, సీజనల్ వ్యాధిగా మారిందని తెలిపారు. వాకర్స్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఆస్పత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫింగర్‌ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే రాళ్లు వచ్చాయి

- ఫింగర్‌ప్రింట్ స్కానర్ బుక్ చేసిన యువకుడు
- పార్సిల్‌లో వచ్చిన రాళ్లు


రాళ్లు వచ్చాయని చెబుతున్న వికాస్

కోనరావుపేట(వేములవాడ): ఆన్‌లైన్‌లో ఫింగర్ ప్రింట్ స్కానర్ బుక్ చేస్తే రాళ్లు వచ్చిన సంఘటన కోనరావుపేట మండలం కనగర్తిలో వెలుగుచూసింది. బాధితుడు తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తికి చెందిన కొల్లూరి వికాస్ ఆన్‌లైన్‌లో ఫింగర్‌ప్రింట్ స్కానర్ కోసం జనవరి 1న బుక్ చేశాడు. 12న డెలివరీ ఇస్తామని షాపింగ్ సంస్థ స్పష్టం చేయగా.. ఆదివారమే పార్సిల్ ఇంటికొచ్చింది. డెలివరీ బాయ్‌కి రూ.2,718 చెల్లించి పార్సిల్ తీసుకున్నాడు. పార్సిల్ తెరిచి చూడగా రాళ్లు కనిపించడంతో కంగుతినడం యువకుడి వంతైంది. మోసం జరిగిందని వెంటనే డెలివరీ బాయ్‌కి చెప్పగా ఐటమ్ రిటర్న్ పెట్టమంటూ వెళ్లిపోయాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


ప్రభాకర్‌రావు(ఫైల్)

పెద్దపల్లి రూరల్: హనుమంతునిపేట గ్రామానికి చెందిన గన్నమనేని ప్రభాకర్ రావు (51) ఆదివారం రైల్వే వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి వైపు వస్తున్న ప్రభాకర్‌రావును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడని ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..


రాజయ్య (ఫైల్)

కరీంనగర్ క్రైం: ఆర్టీసీ బస్సు ఢీకొని, ఓ వ్యక్తి మృతి చెందినట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని విద్యారణ్యపురికి చెందిన బత్తిని రాజయ్య(76) ఆదివారం మధ్యాహ్నం స్కూటీపై గాంధీచౌక్ వైపు వెళ్తున్నాడు. మంచిర్యాల చౌరస్తా సమీపంలో మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో ఒకరు..

- మర్రిపల్లిలో విషాదం


అరిగెల శశికుమార్ (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్ బాట పట్టిన వలసకార్మికుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లికి చెందిన అరిగెల శశికుమార్(32) సౌదీ అరేబియాలో ఉపాధి పొందుతున్నాడు. గత నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దాదాపు 19 రోజుల తర్వాత శశికుమార్ మృతదేహంతో స్వగ్రామానికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కొడుకు, కూతురు, తల్లిదండ్రులు ఉన్నారు.

దొంగకు దేహశుద్ధి


స్థానికుల అదుపులో సతీశ్

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని వివిధ దుకాణాల్లో దొంగతనానికి పాల్పడుతున్న దొంగను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద కొద్దిరోజులుగా రాత్రి వేళల్లో షాప్‌ల వద్ద ఉన్న సామగ్రి చోరీకి గురవుతుంది. దీనిపై స్థానికులు నిఘా పెట్టారు. సుభాష్‌నగర్‌కు చెందిన సతీశ్‌ను ఆదివారం రాత్రి స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

కుక్కల దాడిలో ఆవు, గేదె మృత్యువాత


జేసీబీ సహాయంతో ఆవును పూడుస్తున్న రైతులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కేలోత్‌తండాలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత పిచ్చి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేయడంతో రెండు మూగజీవాలు మృతిచెందాయి. కేలోత్‌తండాకు చెందిన రైతులు కేలోత్ నవీన్, గుగులోత్ దేశాయి వారి ఇళ్ల ముందు కట్టేసుకున్న ఆవు, గేదెలపై కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో అవి ప్రాణాలు కోల్పోయాయి. చనిపోయిన రెండు జీవాలను జేసీబీ సహాయంతో పూడ్చివేశారు .

యువకుడి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన చిలివేరి ధనుష్(18) ఆత్మహత్యకు చేసుకున్నాడు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధనుష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి, చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన సిరికోట రవీంద్రచారి(52) అప్పుల బాధతో నాలుగు రోజులక్రితం పురుగుల మందు తాగాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడు గ్రామంలోని వెల్డింగ్‌షాపు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రవీంద్రచారి భార్య నవ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సదాకర్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక పోటీలు


క్రీడాకారులను పరిచేయం చేసుకుంటున్న దృశ్యం

కరీంనగర్ స్పోర్ట్స్: ఖోఖో సంఘం కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది మహిళలు, పురుషులు హాజరయ్యారు. ఉదయం పోటీలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు క్రీడాకారులను పరిచయం చేసుకొని, ప్రారంభించారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఖోఖో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై.మహేందర్‌రావు, సభ్యులు రవీందర్, దాసరి ప్రసాద్, యోగి సంతోష్, కర్ణాకర్, శేఖర్, శివకుమార్, రాజబాబు, రవళి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


వంశీ


శివ

కరీంనగర్ స్పోర్ట్స్: రాజస్థాన్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేని మధు, జిట్టవేణి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వంశీ, శివ రాణించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి, పెటా అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనిస్ పాషా, సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్, రాజ్‌కుమార్, అనుపరెడ్డి, వీర్‌పాల్ రెడ్డి, భాస్కర్, ఐతరవేని శ్రీనివాస్, వడ్లూరి రాజేందర్, సీనియర్ క్రీడాకారులు ఆదివారం అభినందించారు.